సాక్షి ప్రకాశం

మంగళవారం | 9 | జూలై | 2024



రోగులకు మెరుగైన సేవలందించండి

మార్కాపురం జీజీహెచ్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు.

- 8లో..



కంభంలో రేషన్ బియ్యం పట్టివేత

కంభం మండలం కందులాపురంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో..



ఒంగోలులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

న్యూస్‌రీల్

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్లు చేయించాలి

● డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నీ రకాల ప్రైవేటు ఆస్పత్రులు, క్లినికల్ లేబొరేటరీలు, ఎక్స్‌రే సెంటర్లు, సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ కేంద్రాలు, అన్నీ డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని, ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేయించినవారు రెన్యువల్ చేయించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయించకుండా ఆస్పత్రులను, ఇతర డయాగ్నసిక్ సెంటర్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు విచారణకు వచ్చినప్పుడు పరిశీలించేందుకు సరైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే రిజిస్ట్రేషన్ అధికారుల అనుమతితో చేయాలని, నేటి నుంచి 7 రోజుల్లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మత చిహ్నాలు తొలగించాలి

● ప్రజా సంఘాల ఐక్య వేదిక డిమాండ్



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: రాజ్యాంగం విధించిన లౌకిక విధానానికి కట్టుబడి ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నీ రకాల మత చిహ్నాలను తొలగించాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో మత చిహ్నాలను తొలగించి మత సామరస్యానికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ హోదాలో అన్నీ రకాల మత ప్రార్థనలకు హాజరుకాకూడదని, అన్నీ మతాల ఆలయాల్లో లౌడ్ స్పీకర్లను తొలగించి ధ్వని కాలుష్యాన్ని అరికట్టాలని కోరారు. మతపరమైన ఊరేగింపులు, రాజకీయపార్టీల ప్రదర్శనల్లో లౌడ్ స్పీకర్లు, డీజేలను నియంత్రించాలన్నారు. చట్టబద్ధమైన పాలనను సేవా దృక్పథంతో చేయాలని కోరారు. అనంతరం మీ కోసంలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో వివిధ ప్రజాసంఘాలకు చెందిన ఎం జార్జి, దాసరి అంకయ్య, తాటిపర్తి వెంకటస్వామి, ఎం రమేష్, గాలి సంగీత రావు, డా.శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, టి.ఆనంద్, భీమవరపు సుబ్బారావు, కొంగర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నా రాంబాబు



చీమకుర్తిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

ఎప్పటికీ మా గుండెల్లోనే..

"నేనున్నానంటూ అందరికీ భరోసా..అందరి మదిలను ఆత్మీయంగా స్పర్శించిన రాజశేఖరా నిను మరువలేం.. నీ స్ఫూర్తే మాకు ఆదర్శం.. నీ బాటలోనే పయనిస్తాం.. జోహార్ వైఎస్సార్'' అంటూ వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడంతో పాటు..కేక్ కటింగ్‌లు.. అన్నదానాలు, వస్త్రదానాలు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమాలను జయప్రదం చేశారు.

- ● రాజశేఖరా నిను మరువం అంటున్న జిల్లా వాసులు
- ● వాడవాడలా ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- ● నివాళులర్పించడంతోపాటు సామాజిక కార్యక్రమాల నిర్వహణ
- ● జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



తూర్పుగంగవరంలో అన్నదానం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దేవరాజుగట్టులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



గిద్దలూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నా రాంబాబు

ఒంగోలు:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పండుగ వాతావరణంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. సంబరాలు జరుపుకున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరం చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అందించిన సంక్షేమ పాలన గురించి వివరిస్తూ ఆయన ప్రజల హృదయాధినేతగా నిలిచారన్నారు. ఆయన అందించిన పథకాలు పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచాయని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు ఈవెంట్ మేనేజర్లు వైఎస్సార్‌పై ఉన్న అభిమానంతో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు.

■ మార్కాపురంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కేక్ కట్ చేసి వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను ప్రారంభించగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అన్నా రాంబాబుతోపాటు చెవిరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంయుక్తంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బేస్తవారిపేట, కంభంలలో మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

■ దర్శి వైఎస్సార్ సెంటర్, గడియార స్తంభం సెంటర్లలో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తదితరులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం నిర్వహించి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సింగరాయకొండ, పొన్నలూరు, కొండపి, జరుగుమల్లిలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన అందించిన సలహాలు తమకు నిరంతరం స్ఫురణకు వస్తుంటాయన్నారు. పలుచోట్ల అల్పాహార పంపిణీని ప్రారంభించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

■ సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలో మాజీమంత్రి మేరుగు నాగార్జున, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చీమకుర్తిలోని బూచేపల్లి వారి కల్యాణ మండపం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడుల్లో స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను మేరుగు నాగార్జున నిర్వహించారు.

■ యర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నియోజకవర్గంలోని పుల్లలచెరువు, పెదదోర్నాల, పెద్దారవీడు, వై.పాలెం మండలాల్లో విస్తృతంగా పర్యటించి వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల కూటమి దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పరామర్శించి వారికి ఆర్థిక చేయూతలో భాగంగా చెక్కులు పంపిణీ చేశారు.

■ కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో 300 మందికి చీరలు పంపిణీ చేశారు. ఎస్‌కేర్ మానసిక వికలాంగుల కేంద్రంలో కేక్ కట్ చేసి, చిన్నారులు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. పామూరు మండలం రేగిచెట్లపల్లెలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 250 మందికి చీరలు పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కంభంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సింగరాయకొండలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి సురేష్



కనిగిరిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్

పేదల హృదయాధినేత వైఎస్సార్

- ● ప్రజలు అధికారమిచ్చింది మరింత మంచి చేసేందుకు
- ● కక్షపూరిత వైఖరి సరికాదు...విడనాడాలి
- ● అన్ని అనుమతులున్నా వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి పోనీకుండా అడ్డుకున్నారు
- ● వైఎస్సార్ 75వ జయంతి కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: పేద ప్రజల హృదయాధినేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి ఆయనతోపాటు నగర అధ్యక్షుడు కటారి శంకర్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జంకె వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ,, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రతి పేదవానికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారన్నారు. కానీ నేడు అటువంటి మహానుభావుని విగ్రహాలు ధ్వంసం కావడం దారుణమన్నారు. మంచి నాయకుని స్ఫూర్తిని మనం దూరం చేసుకోవడం సరికాదన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని పథకాలను అమలుచేస్తే మేమే కాదు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ అభినందిస్తారన్నారు. కక్షపూరిత విధానాలు సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రజలు సంతోషంగా ఉండేలా ప్రతి ఒక్కరూ పాలన చేయాలన్నారు. తమ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇటువంటి విధానాలు ఎప్పుడూ చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయరన్నారు. చివరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పార్టీ కార్యాలయంలోకి సైతం పోనీకుండా నిలువరించడాన్ని మీ విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. ఇది రాజులపాలన కాదని, ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రజలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్న విషయాన్ని మాత్రం మరువరాదన్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటూ అవినీతి మరక అంటకుండా వైఎస్ జగన్ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమచేశారన్నారు. అందుకే వారు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. కానీ నేడు కక్షపూరిత విధానాలతో వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం, తగులబెట్టడం బాధాకరం అన్నారు. అన్ని అనుమతులు ఉండి నెలరోజులుగా నిత్యం పార్టీ కార్యాలయం నిర్వహణలో ఉన్నా వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి పార్టీ నాయకులు, కార్యకర్తలను వెళ్లనీయకుండా అడ్డుకోవడం సరికాదని, కార్యాలయానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయన్నారు. పన్ను కూడా చెల్లించామని తప్పకుండా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు స్వామిరెడ్డి, కార్పొరేటర్లు అంగిరేకుల గురవయ్య, చల్లా తిరుమలరావు, గంగవరపు ప్రవీణ్ కుమార్, నాగం వెంకట శేషయ్య, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, యనమదల నాగరాజు, ఈదర చిన్నారి, ఒంగోలు ఎంపీపీ పల్లప్రోలు మల్లికార్జునరెడ్డి, దామరాజు క్రాంతికుమార్, రాయపాటి అంకయ్య, బడుగు కోటేశ్వరరావు, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్లు యరజర్ల రమేష్, బొమ్మినేని మురళి, పసుపులేటి శ్రీనివాసరావు, వైఎస్సార్ కళాపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాటా అంజిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దస్తగిరి, సాధం విజయలక్ష్మి, తోటపల్లి సోమశేఖర్, నగరపాలక సంస్థ కోఆప్షన్ మెంబర్లు రషీదా, వర్ల శేషయ్య, బొప్పరాజు జ్యోతి, సాధం విజయలక్ష్మి, షేక్ నాగూర్, దాసరి కరుణాకర్ పాల్గొని నివాళులర్పించారు.

కార్యకర్తలకు జగనన్న అండ

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



శతకోడులో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లవేళలా అండగా ఉంటారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఎన్నికల సమయంలో పచ్చమూకల దాడిలో గాయపడిన నలుగురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వర్గీయుల దాడికి గురైన వారికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ తరపున ఆర్థిక సాయం పంపించి తన ఔదార్యాన్ని చాటుకున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పడి నెలరోజులు దాటినా రాష్ట్రంలో పచ్చమూకల దాడులు ఆగడంలేదని, అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు చేతకానివారిలా పైశాచిక ఆనందం పొందుతున్నారని, పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాలకు మేలు చేసిన దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలు ఈ సంఘటనలను గమనిస్తున్నారని అన్నారు. టీడీపీ వర్గీయుల ఆగడాలకు రెచ్చిపోకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులు సంయమనం పాటించాలని కోరారు. పుల్లలచెరువు మండలంలోని శతకోడుకు చెందిన ముటుకుల సొసైటీ అధ్యక్షుడు కిలారి కృష్ణ, పెద్దారవీడు మండలంలోని సుంకేసులకు చెందిన గుర్రం ప్రసాద్, యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సాయిలకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఎల్.రాములు, సొసైటీ డైరెక్టర్ జానకి రఘు, రోశిరెడ్డి, గడ్డం సుబ్బయ్య, జడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.365

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర సోమవారం గరిష్టంగా కేజీ రూ.365 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 4734 బేళ్లు రాగా, 3906 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 828 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 100వ రోజు వేలం పాటలో 3165 బేళ్లు రాగా 2691 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 474 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.365, కనిష్టంగా రూ.205 సరాసరి రూ.329.93 వచ్చింది. వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 95వ రోజు వేలం పాటలో 1569 బేళ్లు రాగా, 1215 బేళ్లు కొనుగోలయ్యాయి. 354 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.360, కనిష్ట ధర రూ.307, సరాసరి రూ.307.61 పలికింది.

సమస్యల పరిష్కారానికే మీకోసం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణ శివార్లలోని శ్రీనివాసకల్యాణ మండపంలో మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఒక సమస్యపై అర్జీ ఇస్తే అదే సమస్యపై మళ్లీ ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీల్లో స్థానికంగా ఉండే సమస్యలు గుర్తించి వాటిని వెంటనే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని అర్జీలను వాటి కారణాలను కూడా వివరించాలని అన్నారు. సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, సెబ్ డీఎస్పీ దుర్గా ప్రసాద్, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, డీఎల్‌డీఓ సాయికుమార్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు పంపారు. డివిజన్‌లోని ఆయా మండలాల తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

బేస్తవారిపేట ఆర్‌బీకేలో చోరీ



చోరీకి గురైన ఫ్యాన్లు

బేస్తవారిపేట: స్థానిక పీహెచ్‌సీ సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. ఆర్‌బీకే వెనుక తలుపు పగలగొట్టి లోపలికి ప్రవేశించేందుకు విఫలయత్నం చేశారు. ముందు భాగంలోని తలుపు గ్లోలాం కట్ చేసి లోపలికి ప్రవేశించారు. ఆర్‌బీకేలోని ఐదు ఫ్యాన్లు, రూ.75 వేల విలువగల ఎల్‌ఈడీ టీవీ, రైస్ కుక్కర్, గ్యాస్ స్టవ్, సిలిండర్లు తీసుకెళ్లారు. ఉదయం విధుల్లోకి వెళ్లిన అగ్రికల్చర్ అసిస్టెంట్ సుజాత చోరీ జరిగిందని గ్రహించి ఏఓ జక్కం మెర్సీకి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్యాపకుల కొనసాగింపునకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు: ప్రభుత్వ డిగ్రీ, ఎయిడెడ్, ఓరియంటల్ కాలేజీల్లో కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులుగా 2023–24 విద్యా సంవత్సరంలో పనిచేసిన వారి సర్వీసు 2024–25 విద్యా సంవత్సరానికి పునరుద్ధరించేందుకు సంబంధిత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం మార్చి 31 నాటికి పనిచేస్తున్నవారంతా ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై దాడులు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారుల బృందం

త్రిపురాంతకం: ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయశాఖ ప్రత్యేక తనిఖీ బృందాలు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతులు లేని క్రిమీ సంహారకాల అమ్మకాలను నిలిపివేశారు. త్రిపురాంతకంలోని శ్రీరామ ట్రేడర్స్, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్, మల్లీశ్వరి హైబ్రీడ్ సీడ్ డిపోలను తనిఖీ చేసిన అధికారులు అనుమతులు లేని సుమారు రూ.70 లక్షల విలువైన పురుగుమందులు, సీడ్స్ అమ్మకాలను నిలుపుదల చేశారు. దాడుల్లో ప్రత్యేకాధికారులు జి.లక్ష్మణకుమార్, చంద్రశేఖర్, వ్యవసాయాధికారి కె. నీరజ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు కింద పడి వృద్ధురాలి మృతి



బస్సు వెనుక టైర్ల కింద రాగమ్మ మృతదేహం

నాగులుప్పలపాడు: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం ఉదయం ఉప్పుగుండూరు బస్టాండ్‌లో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు..ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మన్నెగంటి రాగమ్మ (75) ఉప్పుగుండూరు నుంచి ఒంగోలు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చింది. బస్సు బయలుదేరే సమయంలో హడావిడిగా బస్సును ఆపే క్రమంలో కాలి మెలికపడి బస్సు టైర్ల కింద తల ఛిద్రమైంది. ప్రమాదంలో రాగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.

ఏకేయూ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం విడుదల చేసినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో 17 కోర్సులకు నిర్వహించిన ఈ పరీక్షలకు 1153 మంది విద్యార్థులు హాజరుకాగా 865 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీ ఎడ్, ఆక్వా కల్చర్, ఆయిల్ అండ్ ఫాట్స్, ఎకనామిక్స్, హిస్టరీ విభాగాల్లో నూరు శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంబీఏ విభాగంలో 407 మందికి 353, ఎంసీఏ విభాగంలో 49 మందికి 44, ఎంఎడ్ విభాగంలో 182 మందికి 118, బోటనీ విభాగంలో 29 మంది విద్యార్థులకు 24, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 112 మందికి 87, గణితశాస్త్రంలో 85 మందికి 49, ఆర్గానిక్ కెమిస్ట్రీ 151 మందికి 93, ఫిజిక్స్‌లో 23 మందికి ముగ్గురు, సాంఖ్యక శాస్త్రంలో ఆరుగురికి ఐదుగురు, జువాలజీ విభాగంలో 16 మందికి ఏడుగురు, సోషల్ వర్క్ విభాగంలో 14 మందికి 13, ఎంకాం విభాగంలో 24 మందికి 14 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. .

మార్కాపురంలో ఘరానా మోసం

- సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పేరుతో టోకరా
- సుమారు 30 లక్షల రూపాయలు వసూలు

మార్కాపురం:

మార్కాపురం పట్టణంలో మరో ఘరానా మోసం వెలుగుచూసింది. మై క్వీన్ యాప్‌తో వేలాది మంది ప్రజలు మోసపోయిన విషయం మరవక ముందే మరో మోసం బయటపడింది. గుంటూరు జిల్లా రేపల్లె నుంచి వచ్చిన ఓ వ్యక్తి మార్కాపురంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడుతున్నానని నమ్మించి పలువురి వద్ద డబ్బు వసూలు చేశాడు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి తాను డాక్టర్‌నని గతేడాది గుంటూరు జిల్లా రేపల్లెలో ప్రజల నుంచి సుమారు కోటిన్నర రూపాయలు డబ్బులు వసూలు చేసి హాస్పిటల్ ప్రారంభించాడు. అయితే ఆ హాస్పిటల్‌కు గుంటూరు, బాపట్ల జిల్లాలోని పలువురు వైద్యులను విజిటింగ్ డాక్టర్లుగా పిలిపించి క్లినిక్ ప్రారంభించారు. అందులో పెట్టుబడులు పెట్టిన పలువురు తాము మోసపోయామని గుర్తించి డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ బిచానా ఎత్తేసి నెల రోజుల క్రితం మార్కాపురం చేరాడు. రేపల్లె బాధితులు వారంరోజుల క్రితం పోలీసుస్టేషన్‌లో సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు.

మార్కాపురంలో మోసం ఇలా..

మార్కాపురం పట్టణంలో పలువురు ల్యాబ్ అసిస్టెంట్లు, మెడికల్ షాపు ఓనర్లతో మాట్లాడి తాను స్పెషలిస్టు డాక్టర్‌నని, పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేస్తున్నాని నమ్మించాడు. ల్యాబ్ కౌంటర్ పేరుతో రూ.5 లక్షలు, ఫార్మసి కౌంటర్ పేరుతో రూ.10 లక్షలు, ఓపీ విభాగం పేరుతో రూ.5 లక్షలు ఇలా పలువురి దగ్గర నుంచి సుమారు రూ.30 లక్షలు వసూలు చేశాడు. ఎంతకూ వైద్యశాల నిర్మాణం చేపట్టకపోవడంతో డబ్బులిచ్చినవారికి అనుమానం వచ్చి నిలదీయడంతో చల్లగా జారుకున్నాడు. మరోవైపు తాను తీసుకున్న బిల్డింగును సూపర్ స్పెషాలిటీ పేరుతో పడగొట్టించాడు. దీంతో ఆ ఇంటి యజమాని కూడా తనకు సుమారు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని లబోదిబోమంటున్నారు. వైద్యశాలలో పార్టనర్‌షిప్ ఇస్తానంటూ పలువురి వద్ద కూడా రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం పలువురు బాధితులు మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిని పిలిపించి మాట్లాడగా అందరికీ డబ్బులు ఇస్తానని చెప్పి జారుకున్నాడు. డబ్బులు వస్తాయో.. రావోనన్న ఆందోళనలో పెట్టుబడిపెట్టిన వారు ఉన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు తగిన చొరవ చూపాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 75 ఫిర్యాదులు వచ్చాయి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, భూ వివాదాలు, భర్త నిరాదరణ తదితర సమస్యలను బాధితులు ఎస్పీకి విన్నవించారు. ఆయా సమస్యల గురించి బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వారితో ముఖాముఖి మాట్లాడి భరోసా ఇచ్చారు. సమగ్ర విచారణ చేసి చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించిన అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్ రావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన మద్యం కిక్కు

- బావిలో దూకి యువకుడు మృతి



బావిలో నుంచి కొండయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

చీమకుర్తి: మద్యం మత్తు గిరిజన యువకుడు ప్రాణాలను బలితీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సంతనూతపాడు పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ఈ సంఘటనలో పాలపర్తి కొండయ్య(35) మృతి చెందాడు. కొండయ్య మద్యం సేవించి రాత్రి ఒంటిగంట సమయంలో తన నివాసానికి సమీపంలో ఉన్న మంచి నీటి బావి వద్దకు వెళ్లాడు. తొలుత తన దగ్గర ఉన్న కుక్కను బావిలోకి విసిరేశాడు. ఆ తర్వాత తానూ బావిలో దూకాడు. కాపాడాలంటూ పెద్దగా కేకలు వేస్తుంటే దగ్గరలో ఉన్న ఆంజనేయులు అనే వ్యక్తి కొండయ్యను కాపాడేందుకు బావిలో దూకాడు. అప్పటికే కొండయ్య నీట మునగడంతో, ఆంజనేయులు తనను కాపాడాలంటూ పెద్దగా కేకలు వేశాడు. స్థానికులు వచ్చి ఆంజనేయులును, కుక్కను బయటకు తీశారు. సోమవారం ఉదయం స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో పోలీసుల ఆధ్వర్యంలో బావిలో ఉన్న నీటిని మోటర్ల ద్వారా బయటకు తోడించి, కొండయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మంచినీటి బావిలో నీటిని తోడిపోసిన నేపథ్యంలో నాలుగైదు రోజులపాటు తాగునీరు సరఫరా చేయాలని అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ప్రైవేట్ ఆస్పత్రి పసికందు మృతి

- ఆందోళనకు దిగిన బంధువులు



మృతి చెందిన పసికందును చూపుతున్న బంధువు

మార్కాపురం: పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన తమ మగ బిడ్డ చనిపోయాడని సోమవారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టారు. తర్లుపాడు మండలం గానుగ పెంట గ్రామానికి చెందిన అమ్మనబ్రోలు రమణను కాన్పు కోసం సోమవారం ఉదయం మార్కాపురంలోని ప్రముఖ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో చేర్చారు. సోమవారం రాత్రి 7.30 గంటలకు ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన వెంటనే పసికందు మృతి చెందాడు. దీంతో బాలింత బంధువులు వైద్యశాలలో ఆందోళన చేశారు. కాగా ఆమెకు బీపీ అధికంగా ఉందని, ఆమెతో పాటు కడుపులో ఉన్న బిడ్డను కాపాడేందుకు డాక్టర్లు చివరి వరకు ప్రయత్నించారని, తమ చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని ఆస్పత్రి చైర్మన్ చెప్పారు.

అన్ని పాఠశాలల్లో విద్యా ప్రవేశం

ఒంగోలు: విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని 1 నుంచి 8 తరగతుల వరకు ఉన్న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో అమలు చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) పేర్కొన్నారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ అంశంపై సీఆర్‌పీలతో సమీక్షించారు. ఏయే పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు దీక్షా యాప్ ద్వారా లాగిన్ అయ్యారు, ఏయే కృత్యాలు యాప్ ద్వారా అప్‌లోడ్ చేశారు అనే విషయాలపై సీఆర్‌పీలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా లాగిన్ కాని ప్రధానోపాధ్యాయులు వెంటనే లాగిన్ కావాలని, అందుకోసం సీఆర్‌పీలు వారి క్లస్టర్ లోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షించుకోవాలన్నారు. విద్యా ప్రవేశ్, నేను బడికిపోతా, నిష్ఠ, పొగాకు రహిత పాఠశాలలు, ట్రీప్లాంటేషన్ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఇసుక విధానం



స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నూతన ఇసుక విధానాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం చతుకుపాడు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. చతుకుపాడు–1 స్టాక్ పాయింట్‌లో 16,044 టన్నులు, చతుకుపాడు–2లో 24,972 టన్నులు, ఒంగోలు స్టాక్ పాయింట్‌లో 1,818 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఈ స్టాకు పాయింట్ వద్ద ఇసుక డంప్ చేయటానికి సీనరేజ్, రవాణా ఖర్చులు 247 రూపాయలు అయిందన్నారు. ఈ మొత్తాన్ని మాత్రమే ప్రజలు స్టాక్‌పాయింట్ వద్ద చెల్లించాల్సి ఉంటుందని ఒక్కో ట్రాక్టరుకు 1,150 నుంచి 1,200 రూపాయలు చెల్లించాలని మంత్రి వివరించారు. జేసీ గోపాలకృష్ణ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.జగన్నాథరావు, ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

- చీటికిమాటికి ఒంగోలుకు రిఫర్ చేయవద్దు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం టౌన్: మార్కాపురం జీజీహెచ్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం మార్కాపురంలోని జీజీహెచ్‌ను ఆమె సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం, ప్రెగ్నెంట్ లేడీస్‌ను తరచుగా ఒంగోలుకు రిఫర్ చేస్తుండటంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత నెలలో 33 మంది గర్భిణులను ఒంగోలుకు రెఫర్ చేసినట్లుగా రికార్డుల్లో ఉండటంతో చీటికిమాటికి ఒంగోలు పంపడం మంచిది కాదని సున్నితంగా హెచ్చరించారు. మంచి డాక్టర్లు అందుబాటులో ఉన్నందున ఇక్కడే సేవలు అందించాలని స్పష్టం చేశారు. జీజీహెచ్ ఎంట్రన్స్‌లోనే డాక్టర్ల పేర్లు, ఫొటోలు, డ్యూటీ డాక్టర్ల పేర్లు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యశాలలో డైట్ మెనూ కూడా డిస్‌ప్లే చేయాలన్నారు. రాత్రి వేళ డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు బయటకు వెళ్తున్నట్లుగా మీకోసంలో ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, డాక్టర్లు ఎస్.సుబ్బారెడ్డి, ఎం.రాంబాబు, కె.వంశీకృష్ణ, రామచంద్రరావు, సి.సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల పదోన్నతులు వెనక్కి తీసుకోవడమేంటి?

- అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



జేసీతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు జూన్ 27న నాటి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఇచ్చిన ప్రమోషన్ ఆర్డర్‌ను సీడీపీఓ వెనక్కి తీసుకోవడంపై ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఒంగోలు ప్రాజెక్టు కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అంజేశారు. ఒంగోలు ప్రాజెక్టు, అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు అర్హతలను బట్టి పదోన్నతి కల్పిస్తూ జీఓ నెంబర్ 7 ఇవ్వాలని తాము కోరినట్లు వివరించారు. ఒంగోలులో పనిచేస్తున్న కీర్తిప్రియ(కరవది), రెజీనా.బి (ఉలిచి), భవాని(యరజర్ల), అశ్విని(కొప్పోలు), పఠాన్ సల్మా(కోటవీధి)కు పదోన్నతులు కల్పించారన్నారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులతో వీరంతా టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ నెల 2,3 తేదీల్లో ప్రాజెక్టు అధికారులు, సీడీపీఓలు ఆయా అంగన్‌వాడీలకు వెళ్లి, ఫోన్లు చేసి పదోన్నతులను ఉపసంహరించుకున్నట్లు చెబుతున్నారని తెలిపారు. ఈ విషయం మీద కోర్టులకు వెళ్లినా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకుంటామని బెదిరించారని, విల్లింగ్ లెటర్ల మీద సంతకాలు చేయాలంటూ బలవంతం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వినతిపత్రంలో కోరారు. యూనియన్ జిల్లా కోశాధికారి కేవీ సుబ్బమ్మ, నాయకులు కె.ప్రశాంత్ కుమారి పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

టీచ్‌రోడ్డు: మానసిక వ్యాధితో బాధపడుతున్న రిమాండ్ ఖైదీ నగరంలోని ఓ ఆస్పత్రిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆరెమల్ల అశోక్ (24) రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడు. తన తల్లికి చంపిన కేసులో ఒంగోలు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో విశాఖ సెంట్రల్ జైలుకు ఇటీవల తరలించారు. విశాఖలోని మానసిక ఆస్పత్రిలో మే 26 నుంచి చికిత్స పొందుతున్నాడు. అశోక్‌కు ఆదివారం రాత్రి నర్స్ భోజనం పెట్టి మందులను అందజేసింది. కాసేపటి తరువాత అశోక్ నేలపై పడి ఉండడాన్ని గార్డు గమనించాడు. వెంటనే వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అశోక్ బెడ్ షీట్‌తో వార్డుకు మరుగు దొడ్డుకు మధ్యలో ఉన్న కిటికీ గ్రిల్‌కు ఉరివేసుకున్నట్లు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంభంలో రేషన్ బియ్యం పట్టివేత



ఇంటి ముందు ఆటోలో రేషన్ బియ్యం



ప్రభుత్వం నుంచి వచ్చిన గన్నీ బ్యాగులతో సహా అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

- బియ్యం నిల్వ ఉన్న ఇల్లు టీడీపీకి చెందిన వ్యక్తిగా గుర్తింపు

కంభం: మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్, గోడౌన్ డీటీ ప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు..స్థానిక వై జంక్షన్ సమీపంలో నుంచి ఓ ట్రక్‌లో రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తుండగా గమనించిన కొందరు అది ఎక్కడికి తీసుకెళ్లారో గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు రావిపాడులోని మస్తాన్‌స్వామి దర్గా ఎదురు సందులో ఓ ఇంట్లో పార్కింగ్ స్థలంలో సుమారు 150 బస్తాలు, ఇంటి బయట ఉన్న ట్రక్‌లో 50 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని సోమవారం మధ్యాహ్నం గోడౌన్‌కు తరలించారు.

ఆ బియ్యం ఎవరివో తెలియదు..

బియ్యం స్వాధీనం చేసుకున్న ఇల్లు టీడీపీకి చెందిన రావూరి దిలీప్‌ది. అతను కుటుంబంతో కలిసి కొంత కాలంగా గుంటూరులో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. అయితే బియ్యం ఎవరివని అధికారులను అడిగితే తెలియదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. సగానికి పైగా బియ్యం బస్తాలు ప్రభుత్వం నుంచి వచ్చే గన్నీ బ్యాగుల్లోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గన్నీ బ్యాగులపై ఉన్న రిసిప్ట్ లు, నంబర్ల ఆధారంగా అవి గోడౌన్‌కు ఎక్కడి నుంచి వచ్చాయి, ఏ రేషన్ షాపుకు పంపించారో తెలిసిపోతుంది. అధికారులు వాటి ఆధారంగా విచారిస్తే ఏ ఏ డీలర్ల నుంచి ఎవరు కొనుగోలు చేశారో కూడా తెలిసిపోతుంది. గోడౌన్ డీటీ ప్రసాద్‌ను అడగగా బియ్యానికి సంబంధించిన వారు ఎవరూ రాలేదని, బియ్యాన్ని గోడౌన్‌కు తరలించామని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వర్గీకరణ పేరుతో తప్పుదారి పట్టిస్తున్నారు

- మాలమహానాడు ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రం రామారావు
- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడుగా గొట్టిముక్కల వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

ఒంగోలు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణ పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలను తప్పుదారి పట్టిస్తున్నారని మాల మహానాడు ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది గుర్రం రామారావు అన్నారు. జిల్లా మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడిగా గొట్టిముక్కల వెంకటేశ్వర్లును నియమిస్తూ నియామక పత్రం సోమవారం అందించారు. ఈ సందర్భంగా గుర్రం రామారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం సమసిపోయిందని, దాన్ని ఎవరూ ప్రస్తావించకూడదన్న సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఉందని అన్నారు. జడ్జిమెంట్‌ను వ్యతిరేకిస్తే రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్లుగా భావించకుండా పదే పదే వర్గీకరణ అంశాలు లేవనెత్తుతున్నారని చెప్పారు. వర్గీకరణ అంతం మాలల పంతం అనే నినాదంతో మాల మహానాడు వేదిక ఏర్పడిందని, దాని కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పారు. నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు జిల్లాలోని మాల మహానాడు కార్యకర్తలు సహకరించాలని కోరారు. నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను నమ్మకంతో బాధ్యతగా నెరవేరుస్తానని చెప్పారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు. తనకు బాధ్యతను అప్పగించిన రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్దూ విద్యార్థులకు న్యాయం చేయండి

తర్లుపాడు: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీబీఎస్‌ఈ సిలబస్‌ను రాష్ట్రంలో అమలుచేయడం వలన ఉర్దూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను తొలగించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ కలెక్టర్, డీఈఓ సుభద్ర దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో ఆయన ఈ సమస్యపై అర్జీ ఇచ్చారు. సీబీఎస్‌ఈ అమలు చేయడం వల్ల రెండో భాష ఉర్దూ లేదా తెలుగు తీసుకోవాల్సి వస్తుందని, దీంతో సుమారు 200 మంది ఉర్దూ విద్యార్థులు నేరుగా పదో తరగతిలో అడ్మిషన్లు పొందలేకపోతున్నారని వారి దృష్టికి తీసుకొవచ్చారు. కార్యక్రమంలో షేక్ అమీర్, అబ్దుల్ రసూల్, ఖాశీంసా తదితరులు పాల్గొన్నారు. ఎస్‌వీకేపీ కాలేజీలో అడ్మిషన్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు దగ్గుబాటి సోమయ్య కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు డీకేఎం రఫీ ఆధ్వర్యంలో కలెక్టర్, డీఈఓకు వినతిపత్రాలు ఇచ్చారు. నాగరాజు, కొండమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం లేకుండా చిత్తశుద్ధితో పనిచేసి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మార్కాపురం నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించడంతో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గ్రీవెన్స్ నిర్వహించారు. అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు ప్రజా సమస్యల పరిష్కారానికి కొంత సమయం కేటాయించాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీనిలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఇస్లాంపేట ప్రజలు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లే మార్గం అయిన మస్తాన్‌దర్గా నుంచి ఇస్లాంపేట వెళ్లే దారిలో శ్రీకర లాడ్జి, చర్చి సెంటర్, నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూలు తదితర ప్రాంలాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున యాక్సిడెంట్‌లు తరుచూ జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పెద్దచెర్లోపల్లి మండలం శంకరపురం గ్రామానికి చెందిన బెజవాడ ఆదెమ్మ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తాను వికలాంగురాలని తాను వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేసింది.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తా

మార్కాపురం: మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నానని సైనిక సంక్షేమాధికారి రజనీ పేర్కొన్నారు. సోమవారం మాజీ సైనికుల సంఘ భవనంలో సంఘ అధ్యక్షులు శీలం హరినారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మాజీ సైనికుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామకృష్ణయ్య, తిరుమలయ్య, జిల్లా అధ్యక్షుడు ఆర్డినరీ కెప్టెన్ అంకన్న, శ్రీధర్, సుబేదార్ మేజర్ వేణుగోపాల్, వీరనారీమణులు వర వెంకటలక్ష్మి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.